# మట్టిలోని మాణిక్యాలకు ఉపకారం

## నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్

**విద్యార్థుల్లోని ప్రతిభ వెలుగు చూడకపోవడానికి పేదరికం, ఆర్థిక సమస్యలు ప్రధాన కారణాలు. పుస్తకాలు, కనీస సౌకర్యాలు లేక చదవలేకపోవడం లేదా మధ్యలోనే బడి మానేయడం వంటి వాటిని నివారించడానికి కేంద్ర ప్రభుత్వం ఏటా లక్షమందికి స్కాలర్‌షిప్‌లను అందిస్తోంది. రాత పరీక్షలో మెరిట్ సాధిస్తే నాలుగు విద్యా సంవత్సరాల వరకు మట్టిలోని మాణిక్యాలకు ఈ ఉపకారం అందుతుంది.**

ఉన్నత పాఠశాల స్థాయిలో ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులను ఆదుకోడానికి, డ్రాపవుట్లను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)' పథకాన్ని అమలు చేస్తోంది. దేశవ్యాప్తంగా లక్ష ఉపకారవేతనాలను కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. అందులో తెలంగాణ రాష్ట్రానికి దాదాపు మూడువేలు, ఆంధ్రప్రదేశ్‌కి నాలుగువేలకు పైగా అందుతున్నాయి. రాష్ట్రాల వారీగా నిర్ణీత పద్ధతిని అనుసరించి ఉపకారవేతనాల సంఖ్యను నిర్ణయిస్తారు.

ఆయా రాష్ట్రాల నిబంధనలను అనుసరించి రిజర్వేషన్లు అమలు చేస్తారు. దీనికి సంబంధించిన ప్రకటన సాధారణంగా ఏటా ఆగస్టులో వెలువడుతుంది. నవంబరు లేదా డిసెంబరులో రాతపరీక్ష జరుగుతుంది.

ఏడు లేదా తత్సమాన తరగతిలో 55 శాతం మార్కులు లేదా దానికి సమానమైన గ్రేడ్‌ను పొందిన విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాయడానికి అర్హులు. తుది ఎంపిక సమయానికి ఎనిమిదో తరగతిలో 55 శాతం మార్కులు పొంది ఉండాలి. అభ్యర్థులు ప్రభుత్వ, ఎయిడెడ్, స్థానిక

### ఎంపిక విధానం

అభ్యర్థులను ఎంపిక చేయడానికి రాష్ట్రస్థాయిలో రాత పరీక్షలు నిర్వహిస్తారు. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి.

**మెంటల్ ఎబిలిటీ టెస్ట్ (మ్యాట్):** దీనిలో వెర్బల్, నాన్-వెర్బల్ రీజనింగ్, క్రిటికల్ థింకింగ్ నుంచి 90 ప్రశ్నలను 90 మార్కులకు ఇస్తారు. ప్రధానంగా అనాలజీ, క్లాసిఫికేషన్, న్యూమరికల్ సిరీస్, ప్యాట్రన్ పర్‌సెప్షన్, హిడెన్ ఫిగర్స్ తదితరాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. సమయం 90 నిమిషాలు.

**స్కొలాస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (శాట్):** ఇందులోనూ 90 ప్రశ్నలను ఏడు, ఎనిమిది తరగతుల స్థాయిలో బోధించిన సైన్స్, సోషల్, మ్యాథ్స్ సబ్జెక్టుల నుంచి ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. కేటాయించిన సమయం 90 నిమిషాలు. ఫిజిక్స్ 12, కెమిస్ట్రీ 11, బయాలజీ 12, గణితం 20, హిస్టరీ 10, జాగ్రఫీ 10, సివిక్స్ 10, అర్థశాస్త్రం 10 ప్రశ్నలు వస్తాయి.

ప్రతి పేపర్‌లోనూ దివ్యాంగులకు 30 నిమిషాల అదనపు సమయం ఇస్తారు. జిల్లాను యూనిట్‌గా తీసుకొని రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు కేటగిరీల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు రిజర్వేషన్ ప్రకారం అర్హత పొందిన విద్యార్థుల మెరిట్ లిస్ట్ సిద్ధం చేస్తారు. ఓసీలకు 40, బీసీలకు 35, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీలకు 25 శాతం మార్కులను కనీస అర్హతగా నిర్ణయించారు. మెరిట్‌ను అనుసరించి స్కాలర్‌షిప్‌కు తుది ఎంపిక జరుగుతుంది.

**ప్రభుత్వ, ఎయిడెడ్, స్థానిక సంస్థల, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులు అర్హులు**

సంస్థలు, కేజీబీవీ పాఠశాలల్లో రెగ్యులర్ విధానంలో చదువుతూ ఉండాలి. నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ స్కూళ్లు, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని అన్ని రకాల రెసిడెన్షియల్ స్కూళ్లు, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ పథకం వర్తించదు. అభ్యర్థి కుటుంబ వార్షిక ఆదాయం రూ. 1,50,000 మించకూడదు. ప్రభుత్వం ఆమోదించిన కోర్సుల్లో మాత్రమే చేరి ఉండాలి. ప్రధానోపాధ్యాయుడు లేదా తత్సంబంధిత అధికారి నుంచి కాండక్ట్ సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుంది. ఎలాంటి ఉద్యోగం చేస్తూ ఉండకూడదు.

### ఉపకార వేతనం ఎంత?

ఇటీవలి కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ. 1000 చొప్పున మొత్తం సంవత్సరానికి రూ. 12000 స్కాలర్‌షిప్ ఇస్తారు. ఈ విధంగా తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం లేదా తత్సమాన తరగతి వరకు అందిస్తారు. తొమ్మిది నుంచి పదో తరగతికి స్కాలర్‌షిప్ కంటిన్యూ కావాలంటే అభ్యర్థి 55 శాతం మార్కులతో ప్రమోట్ కావాలి. పదోతరగతిలో 60 శాతం మార్కులను పొందితే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఉపకారవేతనం అందుతుంది. మళ్లీ ఇంటర్ ఫస్టియర్ నుంచి 55 శాతం మార్కులతో ప్రమోట్ అయితే ఇంటర్ రెండో సంవత్సరానికి స్కాలర్‌షిప్ ఇస్తారు. ఎంపికైన అభ్యర్థి ప్రతి సంవత్సరం తన స్కాలర్‌షిప్‌ను రెన్యువల్ చేసుకోవాలి.

### దరఖాస్తు ఎలా?

సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్‌లో విద్యార్థుల అప్లికేషన్లను ఆయా స్కూళ్లు సమర్పించాలి. తర్వాత ఆ దరఖాస్తుల ప్రింటవుట్లతోపాటు ఆదాయం, కుల ధ్రువీకరణ తదితర అటెస్టెడ్ కాపీలను డీఈఓలకు పంపాలి. దీంతోపాటు ప్రతి విద్యార్థికి పరీక్ష ఫీజు రూ. 100 ఎస్‌బీఐ చలానా రూపంలో జతచేయాలి.



### నేరుగా అకౌంట్‌లోకి!

స్కాలర్‌షిప్‌కి ఎంపికైన అభ్యర్థులు తల్లిదండ్రులతో కలిపి ఒక జాయింట్ అకౌంట్‌ను ఎస్‌బీఐ లేదా ఇతర ప్రభుత్వరంగ బ్యాంకులో ఓపెన్ చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం పంపిన జాబితా ప్రకారం ప్రతి మూడు నెలలకు ఒకసారి రూ. 3000 లను ఎస్‌బీఐ అభ్యర్థుల ఖాతాలో జమ చేస్తుంది. రిజిస్టర్ అయిన ఒక నెలలో విద్యార్థి కోర్సు మానేస్తే స్కాలర్‌షిప్ ఇవ్వరు. ఏదైనా ఆరోగ్య కారణాల వల్ల అభ్యర్థి వార్షిక పరీక్షలకు హాజరుకాలేకపోతే నిర్ణీత మెడికల్ సర్టిఫికెట్‌ను ప్రధానోపాధ్యాయుడు లేదా ప్రిన్సిపల్ ద్వారా అనారోగ్యానికి గురైన మూడు నెలల్లో పంపాలి. అప్పుడే స్కాలర్‌షిప్ కంటిన్యూ అవుతుంది. (ఆగస్టులో ప్రకటన వెలువడుతుంది. వివరాలకు www.bseap.org, bse.telangana.gov.in చూడవచ్చు.)

# డిగ్రీలోనే నాంది... సివిల్స్‌కు పునాది!

**ఎందరో విద్యార్థుల బంగారు కల.. సివిల్ సర్వీసెస్! డిగ్రీ చివరి సంవత్సరంలోనో, పూర్తయ్యాకో దానిపై దృష్టి పెట్టటం కంటే .. ముందుగానే పునాది ఏర్పరుచుకునే ప్రయత్నం చేయటం మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఒక్కో నీటి బొట్టు కలిస్తేనే ప్రవాహంగా మారుతుంది. అలాగే సివిల్స్‌కు అవసరమైన దృక్పథం అలవర్చుకోవటం, పరీక్ష కోసం చేయాల్సిన ప్రాథమిక కృషి మూడు నాలుగేళ్ళ పాటు విడివిడి అంశాల అధ్యయనంగా.. వాటి సమాహారంగా కొనసాగాలి.**



'సివిల్ సర్వీసెస్‌లో ఎందుకు చేరాలనుకుంటున్నారు?' అనే ప్రశ్న అడిగినపుడు చాలామంది టాపర్లు చెప్పే సమాధానం- 'ఇది మా చిన్ననాటి కల'. అంటే.. వీరు తమ సన్నద్ధతను చిన్నవయసు నుంచే మొదలుపెట్టారని కాదు. నిజానికి అంత అవసరం కూడా లేదు.



వి. గోపాలకృష్ణ
డైరెక్టర్, బ్రెయిన్ ట్రీ.

మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించినవారిలో చాలా మంది మాత్రం తమ సన్నద్ధతను మిగతావారితో పోల్చినపుడు కాస్త ముందుగానే ప్రారంభించివుండటం గమనించవచ్చు. ముందుగా అంటే మరీ ఏడెనిమిది తరగతుల్లోనో, ఇంటర్మీడియట్‌లోనో అని కాదు! పరీక్ష రాయాలనుకుంటున్న సంవత్సరానికి 3-4 ఏళ్ళ ముందుగా.. అంటే గ్రాడ్యుయేషన్ మొదటి సంవత్సరం నుంచి సన్నద్ధత ప్రారంభించటం మేలు. సివిల్స్‌కు అవసరమైన దృక్పథం (ఏ అంశాన్నయినా కేవలం ఒక కోణానికే పరిమితం కాకుండా బొమ్మాబొరుసూ రెండూ చూడగలగడం) పెంచుకునే అవకాశం ఉంటుంది. వివిధ సమస్యలను స్థిమితంగా అధ్యయనం చేసే సమయం, వెసులుబాటు ఉంటుంది. సమస్యలను ప్రజాక్షేమం కోణంలో పరిశీలించటాన్ని అలవర్చుకునే వీలు లభిస్తుంది.

ముందుగా ఇంజినీరింగ్, మెడిసిన్, బీఎస్సీ, బీకాం .. ఇలా దేనిలోనైనా చేరాక సివిల్స్ నిమిత్తం దీర్ఘకాలిక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. సాధారణంగా గ్రాడ్యుయేషన్ సబ్జెక్టులతో పోలిస్తే.. సివిల్ సర్వీసెస్‌లోవి వేరుగా ఉంటాయి. 1. జనరల్ స్టడీస్ 2. జాగ్రఫీ అండ్ ఎన్విరాన్‌మెంట్ 3. ఇండియన్ పాలిటీ 4. ఇండియన్ ఎకానమీ 5. హిస్టరీ ఆఫ్ ఇండియా 6. ఫ్రీడమ్ స్ట్రగుల్ 7. కరంట్ ఇవెంట్స్ 8. మెంటల్ ఎబిలిటీ 9. ఎథిక్స్.. ఇంత విస్తృతమైన విభిన్నమైన సబ్జెక్టుల్లో అభ్యర్థి పరిజ్ఞానాన్నీ, దృష్టికోణాన్నీ పరీక్షిస్తారు. సంబంధిత పుస్తకాల అధ్యయనం, నిపుణుల ప్రసంగాలు విని ఆకళింపు చేసుకోవడం సివిల్స్ అభ్యర్థులకు ముఖ్యం. అంతవరకూ పెద్దగా తెలియని సబ్జెక్టులపై ఆసక్తిని పెంచుకుని, నిలుపుకోవటం... అధ్యయనం చేయటం ...సివిల్స్ ఆశావహులకు ప్రధాన సవాళ్ళు!

కాబట్టి దీర్ఘకాలిక ప్రణాళిక తప్పనిసరి. ఆర్ట్స్ చదివేవారికి కొన్ని సబ్జెక్టులు కలిసినా వాటిలోనూ పరిధి, లోతు విషయంలో ఎంతో తేడా ఉంటుంది.

### దేశంపై అవగాహన ముఖ్యం

సివిల్స్ పరీక్ష కోసం ఏం చదవాలి అని అనుభవజ్ఞులను అడిగితే 'ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలతో సిద్ధమవండి' అని చెబుతారు. ఆ పుస్తకాలన్నీ కొని, ఒకటి లేదా రెండింటితో మొదలుపెట్టి, తరువాత ముందుకు సాగలేకపోవచ్చు. కారణం- చదువుతున్న అంశంపై ఆసక్తిని కొనసాగించలేకపోవడమే. అలా ఆసక్తిని కొనసాగించాలనుకుంటే 21వ శతాబ్దంలో భారత్‌ను అర్థం చేసుకోవాలి. ప్రస్తుతస్థితికి దేశం ఎలా చేరిందో, రేపటి అవకాశాలేంటో గ్రహించాలి.

✦ భారత్ తన బహుళ సంస్కృతితో ప్రపంచాన్ని మంత్రముగ్ధుల్ని చేస్తుంది. తన శక్తితో ఉత్తేజపరుస్తుంది. సంప్రదాయాలతో ఆకర్షిస్తుంది - భారతీయ సంస్కృతి మౌలిక లక్షణాలు దీనికి కారణం. ✦ హింస, పేదరికం, అవినీతి పరంగా దిగ్భ్రాంతి కలిగిస్తుంది. అయినా ప్రపంచ దేశాలు.. ముఖ్యంగా ఇంగ్లిష్ దేశాలు, ప్రజాస్వామిక సంస్థలు అభిమానించేలా ఉంటుంది. ✦ ఈ శతాబ్ద మధ్యకాలానికి ప్రపంచంలోనే జనాభాపరంగా మొదటిస్థానానికీ, ఆర్థికపరంగా రెండో స్థానానికీ చేరుకునే అవకాశముంది. ✦ ఇతర దేశాలతోపాటు భారత్ కూడా భూతాప ప్రభావానికి గురవుతోంది. దానికి పరిష్కారాల విషయంలోనూ ముందుంటోంది. ✦ ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీల విషయంలో కీలకపాత్ర పోషిస్తోంది. ✦ 21వ శతాబ్దం.. భారత్‌దే!

ఈ అంశాలను అర్థం చేసుకునే ప్రయత్నం చేయండి. వాటి విభిన్న కోణాలపై పరిజ్ఞానం సంపాదించే కృషి ప్రారంభించండి. వీటికి సమాధానాలు తెలుస్తున్నాయంటే.. సివిల్స్‌ను అర్థం చేసుకునే మార్గంలో మీరున్నట్లే. అప్పుడిక సివిల్స్‌లో కీలకమైన జనరల్ స్టడీస్‌పై దృష్టిపెట్టవచ్చు.

### జనరల్‌స్టడీస్ విషయంలో..

మొదటి అంచెలో ప్రిలిమ్స్, మెయిన్స్ సిలబస్‌ను విశ్లేషించాలి. 1. కరెంట్ అఫైర్స్ 2. జనరల్ నాలెడ్జ్ 3. హిస్టరీ ఆఫ్ ఇండియా అండ్ నేషనల్ మూవ్‌మెంట్ 4. ఇండియన్ పాలిటీ, గవర్నెన్స్ 5. జనరల్ సైన్స్ 6. ఎకనామిక్ అండ్ సోషల్ డెవలప్‌మెంట్ 7. ఇండియన్ అండ్ వరల్డ్ జాగ్రఫీ. ఈ అంశాలు ప్రిలిమ్స్‌లోనూ, మెయిన్స్‌లోనూ గమనించవచ్చు. ఇలా వివిధ అంశాల్లో పోలికల జాబితా తయారుచేసుకున్నాక సన్నద్ధత ప్రారంభించొచ్చు.

❖ ప్రతి అంశానికీ ఒక కొత్త రిజిస్టర్‌ను పెట్టి, ముఖ్యాంశాలను నోట్ చేస్తుండాలి. శాస్త్రీయంగా ఉండే జాగ్రఫీ వంటి వాటితో మొదలుపెట్టాలి. పదోతరగతి స్థాయిలో చదివిందే కాబట్టి, దీన్ని అందరూ అనుకూలంగా భావించే వీలుంటుంది. దీనికి ఎన్‌సీఈఆర్‌టీ ప్రాథమిక పుస్తకాలు చదివితే సరిపోతుంది.

❖ ప్రాథమిక విషయాలను తెలుసుకున్నాక ఆ సబ్జెక్టుకు వర్తమాన వ్యవహారాలను జోడించడం మొదలుపెట్టాలి. ఉదాహరణకు- తుపాను హెచ్చరిక గురించి దినపత్రికల్లో వార్త వస్తే ...తుపాన్లు ఎందుకు వస్తాయి? లక్షణాలేమిటి అనేది తెలుసుకోవాలి. తుపాన్లకూ, హరికేన్లూ, టోర్నడోలకూ తేడాలేమిటో చూడాలి. తుపాన్లకు పెడుతున్న పేర్లూ, వాటికి కారణాలూ వీటన్నిటిపైనా పరిజ్ఞానం సంపాదించాలి. ఇలా చేస్తే చాలావరకూ ఈ సబ్జెక్టుపై పట్టు వస్తుంది.

❖ తర్వాత ఎన్విరాన్‌మెంట్ చదివితే, అది జాగ్రఫీతో సంబంధమున్నది కాబట్టి కష్టమనిపించదు. జాగ్రఫీకి అనుసరించిన విధానాన్నే పాటించి పరిజ్ఞానం పెంచుకోవాలి.

❖ ఆపై సైన్స్ అండ్ టెక్నాలజీ అధ్యయనం సాగించాలి. దీనిలో తాజా పరిణామాలను గ్రహించాలి.

❖ దీని తర్వాత హిస్టరీ సంగతి చూడాలి. మొదట ఒక నవలలాగా చదవాలి. తర్వాత ఆసక్తి పెరిగాక..దానిపై నోట్సు తయారుచేసుకోవటం మొదలుపెట్టాలి.

❖ మిగిలిన అంశాలైన ఎకనామిక్స్, సోషల్ డెవలప్‌మెంట్, పాలిటీల విషయంలో అధ్యాపకుల సహాయం తీసుకుంటే మంచిది. సీనియర్ల సలహాలు తీసుకోవాలి.

ఈ రకంగా వివిధ సబ్జెక్టుల్లో పునాదిని ప్రణాళికాబద్ధంగా ఏర్పరచుకోవాలి.

## పక్కాగా పాటిస్తే సులువే!



కె. నాగరాజు,
ఐఆర్ఎస్ 2015 బ్యాచ్
అసిస్టెంట్ కమిషనర్,
హైదరాబాద్ కమిషనరేట్

**ఈ రోజుల్లో 21-22 సంవత్సరాల వయసులోనే కొందరు మొదటి ప్రయత్నంలోనే సివిల్స్‌కు ఎంపికవుతున్నారు. వాళ్ళు మొదటిసారే సివిల్స్ పరీక్ష రాసి విజయం సాధించివుండవచ్చు కానీ దానికి పునాదిని అంతకుముందే నిర్మించుకుంటూ వచ్చారని గ్రహించాలి. విద్యార్థులు సాధారణ డిగ్రీ గానీ బీటెక్, మెడికల్ లాంటి వృత్తి విద్యాకోర్సులు గానీ చదువుతూ సివిల్స్‌కు తగిన పునాదిని వేసుకోవచ్చు.**

సిలబస్ చాలా విస్తృతం. దానిలోని ప్రధానమైన తొమ్మిది సబ్జెక్టులకు సంబంధించి ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను చదవటం ప్రారంభించాలి. మార్కెట్‌లో వివిధ సబ్జెక్టుల్లో ప్రామాణికమైన పుస్తకాలు కూడా లభిస్తున్నాయి. ఇవన్నీ చదవటానికి నెలవారీగా సమయాన్ని విభజించుకుని, కేటాయించుకోవాలి. డిగ్రీ కోర్సు మొదటి సంవత్సరం నుంచే డిగ్రీ అధ్యయనానికి ఎలాంటి ఇబ్బందీ కల్గించకుండానే ఈ టైమ్‌టేబుల్ వేసుకోవచ్చు. రోజూ వీలైనంత సమయం క్రమం తప్పకుండా చదివేలా ప్రణాళిక వేసుకుంటే డిగ్రీ ముగిసే సమయానికి సివిల్స్ పరీక్ష ప్రాథమిక అంశాలపై చక్కటి పట్టు వచ్చేస్తుంది.

సివిల్స్ ఆశావహులు ప్రతి రోజూ వార్తాపత్రిక చదవటం అలవాటు చేసుకోవాలి. కరంట్ అఫైర్స్ చాలా ముఖ్యం. ముఖ్యంగా వివిధ అంశాలపై పత్రికల్లో ప్రచురించే ఎడిటోరియల్స్ చదవటం వల్ల భిన్నకోణాలపై అవగాహన వస్తుంది.

హిస్టరీ, పాలిటీ మొదలైన సబ్జెక్టుల అధ్యయనం గురించి యూట్యూబ్‌లో చాలా ఛానల్స్ ఉన్నాయి. తేలిక భాషలో నాణ్యమైన విషయ వివరణతో ఉంటాయవి. వాటిని ఉపయోగించుకోవాలి.

వ్యాసాలు (ఎస్సేలు) రాయటం ప్రత్యేకమైన నైపుణ్యం. సివిల్స్ పరీక్షలో వీటికి ప్రాముఖ్యం ఉంది. సుప్రసిద్ధ నాయకుల, మేధావుల, రచయితల కొటేషన్లు జోడిస్తే వ్యాసాలకు విలువ వస్తుంది. అలాంటివి తెలుసుకుంటూ సందర్భోచితంగా ఉటంకిస్తూ రాయటం డిగ్రీ ముగిసేలోపే సాధన చేయటం మంచిది.

## నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

#### ఏఏఐలో 908 పోస్టులు

సంస్థ: ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ), న్యూదిల్లీ.

**పోస్టులు:** మేనేజర్-496, జూనియర్ ఎగ్జిక్యూటివ్-412

**మొత్తం పోస్టుల సంఖ్య:** 908 (బ్యాక్‌లాగ్ ఖాళీలతో కలిపి) **అర్హత:** డిగ్రీ, పీజీ, బీఎస్సీ, బీకాం, ఐసీడబ్ల్యూఏ/ సీఏ, బీఈ/ బీటెక్, ఎంబీఏ. మేనేజర్ పోస్టులకు సంబంధిత రంగంలో 5 సంవత్సరాల అనుభవం ఉండాలి.

**వయసు:** మేనేజర్ పోస్టులకు 32 ఏళ్లు, జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు 27 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** ఆన్‌లైన్ రాతపరీక్ష, ఫిజికల్ మెజర్‌మెంట్ అండ్ ఎండ్యూరెన్స్ టెస్ట్/ వాయిస్ టెస్ట్/ డ్రైవింగ్ టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా.

**ఆన్‌లైన్ దరఖాస్తు:** 16.07.2018 నుంచి 16.08.2018 వరకు. https://www.aai.aero/

#### నిమ్స్, హైదరాబాద్

సంస్థ: నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్), హైదరాబాద్.

**పోస్టులు-ఖాళీలు:** ఎస్ఆర్ఎఫ్-01, డేటా ఎంట్రీ ఆపరేటర్-01, జూనియర్ నర్స్-01, ల్యాబొరేటరీ టెక్నీషియన్-01, ల్యాబొరేటరీ అటెండెంట్-01 (తాత్కాలికం). **అర్హత:** పదో తరగతితోపాటు జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ సర్టిఫికెట్, డీఎంఎల్‌టీ, ఇంటర్, డిగ్రీ, ఎంఎస్సీ.

**ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్. **చివరి తేది:** 14.07.2018

**వెబ్‌సైట్:** https://nims.edu.in/

### వాక్ ఇన్ ఇంటర్వ్యూ

#### ఎన్ఐఆర్‌టీహెచ్, జబల్‌పూర్

సంస్థ: ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రిసెర్చ్ ఇన్ ట్రైబల్ హెల్త్ (ఎన్ఐఆర్‌టీహెచ్), జబల్‌పూర్, మధ్యప్రదేశ్.

**పోస్టులు:** సైంటిస్ట్, ప్రాజెక్ట్ అసిస్టెంట్ తదితరాలు. **ఖాళీలు:** 82

**అర్హత:** పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, ఎంబీబీఎస్/ బీడీఎస్, అనుభవం.

**ఇంటర్వ్యూ తేది:** 2018 జులై 18, 19, 23, 24.

**వేదిక:** మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్, గ్వాలియర్‌లో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

**వెబ్‌సైట్:** https://icmr.nic.in/

#### సిమెట్, హైదరాబాద్

సంస్థ: సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ (సిమెట్), హైదరాబాద్.

**పోస్టులు:** సీనియర్ ఆపరేటర్, జూనియర్ ఆపరేటర్ తదితరాలు (తాత్కాలికం).

**ఖాళీలు:** 18 **అర్హత:** సంబంధిత సబ్జెక్టులు/ బ్రాంచుల్లో బీఎస్సీ, బీఈ/ బీటెక్, డిప్లొమా, అనుభవం. **ఎంపిక:** రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ద్వారా. **ఇంటర్వ్యూ తేది:** 2018 జులై 18, 19, 20 తేదీల్లో. **వేదిక:** సిమెట్, ఐడీఏ ఫేజ్-3, చర్లపల్లి, హెచ్‌సీఎల్ (పోస్ట్), హైదరాబాద్-500 051.

**వెబ్‌సైట్:** http://www.cmet.gov.in/

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు